

# మనం

## కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

శనివారం | 22 | ఏప్రిల్ | 2023 | పేజీలు : 6


# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను వంచిస్తున్నాయి

**పోలీసులను సిఎం దొర పాలేర్లుగా వాడుకుంటున్నారు**

**బడాయి మాటలు తప్ప కెసిఆర్ ప్రజలకు చేసిందేమీ లేదు**

**కాంగ్రెస్ తోనే సుభిక్ష పాలన సాధ్యం: సిఎల్పీ నేత భట్టి విక్రమార్క**



జమ్మికుంట, ఏప్రిల్ 21 (మనం న్యూస్): మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను వంచిస్తూ పాలన సాగిస్తున్నాయని సిఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. గత తొమ్మిదేళ్లుగా బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేయడాన్ని పక్కనబెట్టి దోపిడీకి పాల్పడడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయని ఆరోపించారు. మిగులు రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. భట్టి విక్రమార్క నిర్వహిస్తోన్న హాత్ సే హాత్ జోడో యాత్ర శుక్రవారం జమ్మికుంట మండలం తనుగుల క్రాస్ వద్ద మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి బల్మూరు వెంకట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికాయి. మహిళా కార్యకర్తలు విక్రమార్కకు తిలకం దిద్ది మంగళహారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం నాగంపేటలోని శిబిరం వద్ద ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో విక్రమార్క మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలన తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలు చెల్లించే పన్నులతో ఖజానానుంచి జీతాలు తీసుకునే పోలీసు అధికారులు సైతం ఇసుక మాఫియా కోసం పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని పోలీసులను సిఎం కెసిఆర్ దొర పాలేర్లుగా వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వారి సొంత పనులకు పోలీసులను వినియోగించుకోవడం తప్ప, రాష్ట్ర ప్రజల ధన, మాన, ప్రాణాల్ని కాపాడేందుకు పురమాయించడం లేదని ఆరోపించారు. కోరి తెచ్చుకున్న తెలంగాణలో అప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరుచుకున్న దౌర్భాగ్యంగా మారిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఉద్యోగాలు రాకపోవడమే కాకుండా, రాకరాక నోటిఫికేషన్లు వస్తే ప్రశ్నాపత్రాల లీకేజీ చేసి వాళ్లకు సంబంధించిన మనుషులకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఇండ్లు అతీగతీ లేవు, భూ పంపిణీ లేదు, నిత్యావసన సరుకుల ధరలు విపరీతంగా పెంచారు, ధరల నియంత్రణ చేసే వ్యవస్థ లేదు.. అటు కేంద్రం ఇటు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని భట్టి ధ్వజమెత్తారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన నరేంద్ర మోదీ ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తడం లేదని, ఆయన శిష్యుడు బండి సంజయ్ ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ మాయమాటలు చెబుతున్నాడని విమర్శించారు. తెలంగాణ మోడల్ దేశవ్యాప్తంగా అమలు చేస్తానని

మిగతా 2లో..

# సజావుగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ

**రైతులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు : మంత్రి కమలాకర్**



కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 21 (మనం న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి గంగుల కమలాకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ రాష్ట్రమే దేశంలో నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు అనుకూల విధానాలు, రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచితకరెంటు, కాళేశ్వర జలాలతో పంట విస్తీర్ణం ఏటికేడు పెరుగుతూ రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరిస్తున్నామన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రైతు పండించిన చివరి గింజను మద్దతు ధరతో కొనాలన్న ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ప్రపంచవ్యాప్త నివేదికల్లో ఓవైపు యావత్ ప్రపంచంలో 20ఏళ్ల కనిష్టానికి బియ్యం ఉత్పత్తి పడిపోతుంటే, కేవలం తెలంగాణలో మాత్రమే బియ్యం ఉత్పత్తి ఆరింతలు పెరిగిందన్నారు. ఇది తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ సాధించిన ఘనత అని పేర్కొన్నారు. నిన్నటివరకూ రాష్ట్ర వ్యాప్తంగా 1131 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి వాటి ద్వారా 186 కోట్లు విలువ చేసే 1లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని అత్యధికంగా నల్గొండ, నిజమాబాద్‌లో కొనసాగుతుందన్నారు. ధాన్యం కోతలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థానిక యంత్రాంగం నిర్ణయం తీసుకుంటుందని, లక్ష్యం మేరకు సేకరణకు అవసరమైన 7031 పైచిలుకు కొనుగోలు కేంద్రాలు, గన్నీ బ్యాగులు, మాయిశ్చర్ మిషన్లు, వేయింగ్ మిషన్లు, హమాలీలును సమకూర్చుకున్నామని, అకాల వర్షాల నేపథ్యంలో టార్పలిన్లను సైతం అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ఫెయిర్ ఆవరేజి క్వాలిటీతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి దాన్యం అమ్ముకోవాలని మంత్రి సూచించారు.ఈ సమీక్షలో సివిల్ సప్లయి కమిషనర్ అనిల్ కుమార్, పౌరసరఫరాల సంస్థ జిఎం రాజారెడ్డి, కరీంనగర్ అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్, జిల్లా డిసిఎస్ ఓ.సురేష్ రెడ్డి, డిఎం శ్రీకాంత్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాయపట్నం-కరీంనగర్ రహదారిపై రోడ్డు ప్రమాదం

**- లారీ, మినీ బస్సు ఢీ**

**- డ్రైవర్ మృతి పలువురికి తీవ్రగాయాలు**

**- రోడ్డుపై పడ్డ చెట్టు తొలగించకపోవడంతోనే ప్రమాదం**

వెల్గటూర్, ఏప్రిల్ 21 (మనం న్యూస్): కరీంనగర్ రాయపట్నం రాష్ట్ర రహదారిపై కొత్త పేట గ్రామం వద్ద శుక్ర వారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గజ్వేల్ (బెజ్గాం) నుండి ధర్మపురి కి వెళుతున్న మినీ వ్యాన్(ఎపి 29 వి8267) కొత్త పేట గ్రామం వద్ద రోడ్డుపై గురువారం వీచిన ఈదురు గాలులకు రోడ్డు పై పడి ఉన్న చెట్టును తప్పించబోయి కరీంనగర్ వైపు వస్తున్న లారీని(టి ఏస్ 07యూ ఈ7289) ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో మినీ బస్సులో ప్రయాణిస్తున్న 25 మందిలో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై నరేష్ కుమార్ హుటాహుటిన తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని జెసిబీ సహాయంతో బస్సులోని క్షత గాత్రులని రక్షించి 108 అంబులెన్స్‌లు, ప్రైవేటు వాహానాల ద్వారా ఆసుపత్రులకు తరలించారు. బస్సు డ్రైవర్ పగిల్ల ఎల్లయ్య



ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఈ సంఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.





గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు రోడ్డు పై చెట్టు పడడంతో దానిని తొలగించక పోవడంతో నే ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను వంచిస్తున్నాయి

మొదటి పేజీ తరువాయి..

కేసీఆర్ గాలి మాటలు చెబుతున్నారని, 42 కోట్లతో ఏర్పాటు చేసిన నీళ్లు రాని మిషన్ భగీరథ, ఏ ఒక్క ఎకరానికి నీళ్లు ఇవ్వని కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్ష కోట్లు ఖర్చు పెట్టి గోదావరి నీళ్లు తెలంగాణకు రాకుండా కుట్ర చేసిన ప్రణాళికను తెలంగాణ మోడల్ అంటారా? అని ప్రశ్నించారు. తెలంగాణ మోడల్ పేరుతో డబ్బులు సంపాదించుకోవాలన్న ఆశ, యావ తప్ప ప్రజలకోసం పనిచేయాలని బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాలకు లేదన్నారు. స్వాక్షాత్తు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హైదరాబాద్ సభల్లో పాల్గొని కెసిఆర్ అవినీతి చిట్టా తమ వద్ద ఉందని, కాళేశ్వరం ఆయనకు ఎటిఎంగా మారిందని పేర్కొన్నారు గానీ, ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని విక్రమార్క ప్రశ్నించారు. కెసిఆర్ పాలనలో ప్రజలకు ఆత్మాభిమానం, ఆత్మగౌరవం లేకుండా చేశారన్నారు. ప్రశ్నించే వాళ్లను అరెస్ట్ చేసి జైళ్లలో పెడుతూ కేసులతో వేధిస్తున్నారని పేర్కొన్నారు. బడాయి మాటలు మాట్లాడడం తప్ప తెలంగాణ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కెసిఆర్ చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలంతా ప్రజాప్రభుత్వమైన ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర లక్ష్యాలైన నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవాన్ని తీసుకురావడం రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ వల్లే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కమిటీ సభ్యులు, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్ , యువజన కాంగ్రెస్



ఉపాధ్యక్షులు సాంబయ్య , కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కవంపల్లి సత్యనారాయణ , కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు కర్ర భగవాన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి, మండల అధ్యక్షుడు పుల్లూరి సదానందం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్, ఇల్లందకుంట మండల పార్టీ అధ్యక్షుడు ఇంగిలే రామారావు, నాయకులు కసుబోజుల వెంకన్న , సాయిని రవి, ఎర్రబెల్లి రాజేశ్వరరావు, ఎర్రం సతీష్ రెడ్డి, సలీంపాషా, సలీం, సజ్జు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన కౌశిక్‌రెడ్డి



వీణవంక-ఏప్రిల్21(మనం న్యూస్): మండలకేంద్రంలో ప్రభుత్వ విప్,శాసనమండలి సభ్యుడు, నియోజకవర్గ ఇంచార్జి పాడి కౌశిక్‌రెడ్డి పదిమంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను అలాగే ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసీఆర్ ప్రతి కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాడని, కళ్యాణ లక్ష్మి పథకం వల్ల ఆడపిల్లల తల్లిదండ్రులకు ఎంతో భరోసా కలిగిందని అన్నారు. ప్రతి కుటుంబం కెసీఆర్ తోడుగా ఉండా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత శ్రీనివాస్, సర్పంచ్ నీల కుమారస్వామి, ఉపసర్పంచ్ భానుచందర్, వార్డు సభ్యులు సంపత్,రాజు,తాళ్లపెల్లి మహేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కృష్ణచైతన్య,క్రాంతి ,మధు,పున్నం చందర్, రెడ్డిరాజుల రవి, లింగయ్య, కాసర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోండి: ఎంపీఓ కాటం భాస్కర్



రామగిరి,ఏప్రిల్ 21 మనం న్యూస్ : ప్రభుత్వ కంటి వెలుగు శిబిరమును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రామగిరి ఎంపీవో కాటం భాస్కర్ అన్నారు. శుక్రవారం రత్నాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో జరుగుతున్న ఉచిత కంటి వెలుగు శిబిరమును ఆయన సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావుతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల కోసం వారి ఆరోగ్య రక్షణలో భాగంగా ఈ ఉచిత శిబిరంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించుకోని,ఉచితముగా కళ్ళజోడులు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ వైద్యాధికారి ఎం.విజయకుమార్,అప్తమెట్రిస్ట్ వంశీకృష్ణ,సెక్రటరీ పెండ్లి రమ్య, డాటా ఎంట్రీ ఆపరేటర్ సిద్ధ వెంకటేష్, ఏఎన్ఎం మన్నాల రాణి, వెంకట లక్ష్మి,ఆశ వర్కర్లు ఆంగూరి విజయలక్ష్మి,మేడ స్వరూప, పంజా శాంత,తులసి,గడ్డం సునీత,కారోబార్ కొండపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మచ్చుపేట బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహంకు భూమి పూజ



ముత్తారం,ఏప్రిల్ 21 మనం న్యూస్ : మండలంలోని ముత్తారం గోదావ రిఖని ప్రధాన రహదారి పై ఉన్న మచ్చుపేట బస్టాండ్ వద్ద శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేడగోని సతీష్‌గౌడ్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం ప్రతి గ్రామాలలో ఉండాలని సూచించారు. అంబేద్కర్ చూపించిన మార్గంలో యువత ప్రయాణించాలని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యుగేందర్‌యాదవ్,మాజీ సర్పంచ్ గోవిందులు ఆనంద్, గ్రామ అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాలతో రైతులకు అండ

### మచ్చుపేటలో ఐకేపీ కొనుగోలు కేంద్రం ప్రారంభోత్వంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య

ముత్తారం,ఏప్రిల్ 21 మనం న్యూస్ : తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రైతులకు కొండంత అండ అని ఎంపీపీ జక్కుల ముత్తయ్య అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మచ్చుపేట ,ఖమ్మంపల్లి,మైదంబండ,హరిపురం,ముత్తారం గ్రామాలలో ఐకేపి కొనుగోలు, కేంద్రాలను ఎంపీపీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు కేంద్రాలను తీసుకువచ్చి అమ్ముకోవాలని కోరారు. ఏ గ్రేడ్ 2060,బి గ్రేడ్ 2040 లు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్‌రెడ్డి,ఎంపీడీ శ్రీనివాస్,మచ్చుపేట సర్పంచ్ సతీష్,రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు అత్తే చంద్రమౌళి,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నూనె కుమార్,మచ్చుపేట మాజీ సర్పంచ్ గోవిందుల పద్మ ఆనంద్,ఐకెపి ఏపిఎం పద్మ ఐకెపి సిబ్బంది తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వహిస్తున్న ఆర్ అండ్ బి అధికారులు

### అడవిశ్రీరాంపూర్ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి బాలాజీ



ముత్తారం,ఏప్రిల్ 21 మనం న్యూస్ : ముత్తారం నుండి అడవిశ్రీరాంపూర్ గ్రామానికి గత రెండు నెలల క్రితం బిటి రోడ్డు వేయడం జరిగింది. రోడ్డు వేసే ముందు రోడ్డుకి ఇరువైపులా చదును రోడ్డు వేయాలి కానీ సదర్ కాంట్రాక్టర్ ముందే బిటి వేయడం జిరగింది రోడ్డు వేసిన తర్వాత నైన రోడ్డు కిరువైపులా చదును చేసి మట్టి పోయాలి. మట్టి పోయకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనదారులు ఎవరు రోడ్డు దిగకపోవడంతో వాహనదారులు చాలా ఇబ్బంది గురవుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. రోడ్డుపై ఎలాంటి స్పీడ్ బ్రేక్టర్లు వేయలేదు మేము ఒక ఎంపీటీసీగా మా బాధ్యతగా మేము చాలాసార్లు ఆర్ అండ్ బి ఏ ఈ,డిఈకి,సదరు కాంట్రాక్టర్ కి చరవాణి ద్వారా చాలాసార్లు విన్నవించడం జరిగింది కానీ ప్రభుత్వ అధికారులు ఇంతవరకు స్పందించకపోవడం శోషనీయం ఇప్పటికైనా అధికారుల స్పందించి కాంట్రాక్టర్ తో రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయించగలరు అధికారులు స్పందించనిచో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నాము.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ ముత్తయ్య,ప్రత్యేక అధికారి ప్రవీణ్‌రెడ్డి

ముత్తారం,ఏప్రిల్ 21 మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని ముత్తారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పోతారం గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యమాన్ని మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కంటి వెలుగు పథకం తీసుకువచ్చి ఎంతో మంది జీవితంలో వెలుగు నింపుతున్నారన్నారు. ఈ ఫథకంను మండలంలోని ప్రతి గ్రామంలో వంద శాతం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్,ఎంపిఓ వేణుమాధవ్,సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నూనె కుమార్,సర్పంచ్లు నెత్తిట్ల మహేందర్‌యాదవ్,



సతీష్, సంపత్‌రావు, బియ్యాని శ్యామల సదానందం,రామగళ్ల పోశమ్మ,మధూకర్ పాల్గొన్నారు.

# వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

రాజన్న సిరిసిల్ల, ఎప్రిల్ 21, (మనం న్యూస్): సిరిసిల్ల పట్టణంలోని స్థానిక 8వ వార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, పెద్దూరు 22వ వార్డ్ లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, టీఎస్పిటీడీసీ చైర్మన్ గూడురి ప్రవీణ్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గడ్డం నర్సయ్య, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణిలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిందం కళ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం మెప్మా, ఐకెపి, ఫ్యాక్స్ మొదలగు సెంటర్ల ద్వారా కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయించారన్నారు. రైతులు దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని సూచించారు. వరి ధాన్యం పూర్తి స్థాయిలో చివరి వరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సీఎం కేసీఆర్ అన్ని ఏర్పాట్లను చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు వోజ్జల అగ్గి రాములు, కౌన్సిలర్ సభ్యులు భూక్య రెడ్డి నాయక్ ల్, చెన్నమనేని కీర్తి కమలాకర్ రావు, లింగంపల్లి సత్యనారాయణ, కల్లూరి లత మధుజ్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్మిక విభాగం అధ్యక్షులు వెంగళ శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు ఎండి సత్తార్, పెద్దూరు ఫ్యాక్స్ చైర్మన్ జెల్ల కిషన్, మాజీ



ఎంపీపీ వైస్ చైర్మన్ ఎర్రవెల్లి రమణ రావు, విశ్వనాథ స్వామి దేవాలయం ధర్మకర్త పంగ రవి, ఎండి పాషా, పెద్దూరు ఫ్యాక్స్ వైస్ చైర్మన్ నారాయణ గౌడ్, ఇతర కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, మెప్మా అధికారులు అమాలి సంఘం వారు, బీఆరెస్ పార్టీ నాయకులు, రైతులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ



జమ్మికుంట, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు దారుసలం మసీదులో శుక్రవారం రంజాన్ పండుగ పురస్కరించుకొని ముస్లిం సోదరులకు మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, స్థానిక కౌన్సిలర్ శ్రీపతి నరేష్ గౌడ్ తో కలిసి రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ముస్లిం మైనార్టీలకు రంజాన్ సందర్భంగా కానుకలను పంపిణీ చేస్తుందన్నారు. సోదర భావానికి, మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలుచ, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సర్పంచ్ వినూత్న నిరసన



రామడుగు ఏప్రిల్ 21 (మనం న్యూస్): మండలం లోని వ న్నారం గ్రామంలో ఇసుక మాఫియా ఆగడాలు రోజు రోజు పెరుగుతున్నా, పట్టించుకోని అధికారుల తీరుపై ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మీ వినూత్న నిరసన తెలిపారు. శుక్రవారం రోజు గ్రామ సభ నిర్వహించాల్సి ఉండగా అధికారులు, ప్రజలు ముందే గ్రామ పంచాయతీ కార్యాలయంలో కి వెళ్లి తలపులు వేసుకుని స్వీయ నిర్బంధం చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేయడం వల్ల వాగు పరిసర ప్రాంతాలలో భూగర్బ జలాలు అడుగంటి పోతున్నాయని ,అడ్డు వచ్చిన వారిని బయ భ్రాంతులకి గురిచేస్తున్నారన్నారు.ఈ సమస్య పై ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఫ్యాక్స్ చైర్మన్




ధర్మారం,ఏప్రిల్ 21(మనంన్యూస్): ధర్మారం మండల కేంద్రంలో భవాని కమ్యూనికేషన్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మేడారం ఫ్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చలివేంద్రం నిర్వాహకులు సంగతి సంతోష్. స్థానిక ఉపసర్పంచ్ ఆవుల లత. ఎంపీటీసీ సూరమళ్ళ శ్రీనివాస్. బీఆర్ఎస్ నాయకులు కూరపాటి శ్రీనివాస్. దేవి రాజ లింగయ్య. పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు బాస తిరుపతి. దేవేందర్ రెడ్డి.యాదవ సంఘం నాయకులు జంగ మహేందర్. తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

### రామగుండం శాసన సభ్యులు చందర్



గోదావరిఖని, ఏప్రిల్ 21 (మనం న్యూస్): రామగుండం సమగ్ర అభివృద్దే మా లక్ష్యమని,అభివృద్ధిలో అగ్ర భాగాన నిలుపాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నామని రామగుండం శాసన సభ్యులు కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం 27వ డివిజన్ లోని ప్రభుత్వ బాలుర పాఠశాలకు 5 లక్షల పట్టణ ప్రగతి నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కెసిఆర్,ఐటి శాఖ మంత్రి కేటీఆర్,కోప్పుల ఈశ్వర్ ల ఆశీస్సులతో రామగుండం కార్పొరేషన్ కు అధిక నిధులను మంజూరు చేయించి ప్రతి డివిజన్లో అభివృద్ధి పనులకు అధిక మొత్తంలో నిధులను కేటాయిస్తూ రామగుండాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నమన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో తాము అభివృద్ధి పనులు చెపడుతున్నామని చెప్పారు. తాము చదువుకున్న స్కూల్ కు రోడ్డు వేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మన కోసం,మన సంక్షేమం కోసం కృషి చేస్తున్న కెసిఆర్ ని ప్రజలందరూ ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్,డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు,కార్పొరేటర్లు కలువల శిరీష సంజీవ్, దొంత శ్రీనివాస్,రమణారెడ్డి,కొమ్ము వేణుగోపాల్,నాయకులు అచ్చె వేణు,బెంద్రం రాజిరెడ్డి,ఈదునూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ ఏర్పాట్లను పరిశీలించిన కోమటిరెడ్డి



కరీంనగర్, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః రంజాన్ పండుగ సందర్భంగా నగరంలోని సలేహనగర్ ఈద్గా వద్ద చేస్తోన్న ఏర్పాట్లను నగర కాంగ్రెస్ నాయకులతో కలిసి సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి దుమారంవల్ల పరదాలు,పైపులు దెబ్బతిన్నాయని వెంటనే ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. గత ఏడాది తాగునీటికి ఇబ్బంది ఏర్పడిందని, ఎండలు మండిపోతున్నాయి కాబట్టి తాగునీటి ఏర్పాట్లు సక్రమంగా చేయాలని కోరారు. యువకులు వాహనాలను అతివేగంగా నడుపవద్దని పండుగ సందర్భంగా రోడ్లు రద్దీగా ఉండే నేపథ్యంలో జాగ్రత్తగా ఈద్గావద్దకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండాటీ శ్రీనివాస్ రెడ్డి, ఎండి చాంద్, ఖాజాఖాన్, పొరండ్ల రమేష్, కీర్తి కుమార్, కంకణాల అనిల్ కుమార్, నదీమ్, జాఫర్, మహమ్మద్ భారీ, హనీఫ్, శివరాం, ఇమ్రాన్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఛానల్ పై కేసు ఉపసంహరించుకోవాలి

### ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ

### సెంట్రల్ కమిటీ సభ్యులు జోజిరెడ్డి




కరీంనగర్, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః జోగు రామన్న అవినీతి అక్రమాలను వెలికి తీసిన అమ్మా చానల్ పై నమోదు చేసిన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం వస్తే బంగారు తెలంగాణ చేస్తామని హామీలు చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. ప్రజలకు వారధిలా ఉండే అమ్మ న్యూస్ పై కేసు పెట్టిన జోగు రామన్న పై బిఆర్ఎస్ ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే మీడియా రంగాలను నిలదీసిన నిందించే హక్కు ఎవరికీ లేదని పేర్కొన్నారు. అమ్మ ఛానల్ పై పెట్టిన కేసును తక్షణమే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని జోజిరెడ్డి హెచ్చరించారు.

## వడ్లు కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ కు వినతిపత్రం



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 21 (మనం న్యూస్): సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్ద బోనాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలని కోరుతూ మహిళ సంఘ సభ్యులు, స్థానిక వార్డు కౌన్సిలర్ కల్లూరి లత-మధులు శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లూరి లత మాట్లాడుతూ గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రానికి స్థలం లేక బైపాస్ రోడ్డుపై వడ్లు పోయడం వల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సానుకూలంగా స్పందించిన చైర్ పర్సన్ స్థలం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద బోనాల మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

### ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

### చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



చొప్పదండి,ఏప్రిల్21 (మనంన్యూస్): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. చొప్పదండి మార్కెట్ కమిటీ, భూపాల పట్నం, వెదురుగట్ట, రుక్మాపూర్ ,చాకుంట గ్రామాల్లో ఐకెపి కేంద్రాలు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ కాళేశ్వరం జలాలతో వరి సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. ఒకప్పుడు చొప్పదండి నియోజకవర్గం మెట్ట ప్రాంతం తాగడానికి కూడా డా నీళ్ల లేని పరిస్థితి నుంచి వరి సాగు చేసే స్థితికి చేరిందని అన్నారు.గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చి వరి సాగు చేసుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో సుమారు 70 వేల ఎకరాల్లో వరి సాగు చేశారని అన్నారు.అధికారులు సూచించిన విధంగా తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు.

## మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



తిమ్మాపూర్, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం వచ్చునూరు గ్రామానికి చెందిన ఈగ రాజ్ కుమా ర్ (31) శుక్ర వారం సాయంత్రం ఇంటిలోఎవ్వరు లేని సమయంలో ఉరివేసుకొని, కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన సమాచా రం ప్రకారం మృతుడు రాజ్ కుమార్ కు దాదాపు సంవత్సరం కింద వివాహం కాగా, ప్రైవేట్ స్కూల్లో పని చేసేవా డు. ఈ మధ్య ఇంటి వద్దనే తన తల్లితో ఉంటున్నా డు. గతంలో తండ్రి, తాత, నానమ్మ లు కూడా చని పోవడంతో మానసికంగా తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డట్లు మృతుని బంధువులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎల్ఎండి ఎస్ఐ ప్రమోద్ రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించినట్టు తెలిపారు.

### బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో...

## పోలీసులకు ఎనర్జీ డ్రింక్ పంపిణీ




సిరిసిల్ల, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః బిసి విద్యార్థి సంఘం సిరిసిల్ల డివిజన్ ఇంచార్జీ ఇల్లందుల ప్రకాష్ ఆధ్వర్యంలో సిరిసిల్ల ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి శుక్రవారం గ్లూకోజ్, ఎనర్జీ డ్రింక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం సిరిసిల్ల డివిజన్ ఇంచార్జీ ఇల్లందుల ప్రకాష్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టిన మున్సిపల్ చైర్మన్



జమ్మికుంట, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కెళ్ళపల్లి రాజేశ్వరరావు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఎండాకాలం దృష్ట్యా ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా ఉండాడనికి పలు వార్డులలో చేతి పంపులు లీకైన పైపు లైన్ లు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని పట్టణ ప్రజలకు మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు తెలిపారు. కొత్తపల్లిలో పైప్ లైన్లు చేతి పంపులు సిబ్బందితో రిపేర్ చేయించి నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. వార్డుల్లో ఇలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే సమాచారం అందించాలని ఆయన తెలిపారు. సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు దళితుల అభ్యున్నతి కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బంధు కార్యక్రమం రెండో విడత అందరూ ఒకేలా షాప్ లు అన్ని పెట్టినవే పెట్టకుండా ఉండే విధంగా చూసుకోవాలని రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం పలు సంస్థల ప్రతినిధులు నిర్వహించిన అవగాహన సదస్సు లో పాల్గొని దళిత బంధు లబ్ధిదారులకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందే రాధిక శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య, జమ్మికుంట ఎంపిడిఓ కల్పన, వార్డ్ కౌన్సిలర్లు, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రం



మానకొండూరు, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః మానకొండూర్ మండల కేంద్రంలో మసీద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీ సదర్ పెద్దలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణలో ముస్లిం సమాజం సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. తెలంగాణ లో బిఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీనిచ్చి మోసం చేసిందన్నారు. కేంద్రం లో బీజేపీ ముస్లిం సమాజం ని ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉంచాలని చూస్తుందని అన్నారు. మైనారిటీ సమాజం భద్రంగా ఉండాలంటే బిఎస్పీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువకులు, బిఎస్పీ అసెంబ్లీ ఇంచార్జ్ కుమ్మరి సంపత్, మండల అధ్యక్షులు దాసరి కొమురయ్య, సీనియర్ నాయకులు సిరిసిల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించిన మున్సిపల్ చైర్మన్



కొత్తపల్లి, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః కొత్తపల్లి మున్సిపల్ పట్టణంలో ఐదవ వార్డ్ లోని అభ్యుదయ కమిటీ హాల్ వద్ద కొన్ని రోజుల నుండి 10 కుటుంబాలకు మంచినీరు రావడంలేదని స్థానిక కౌన్సిలర్ వేణుగోపాల్ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. సంబంధిత ఎఇ, కాంట్రాక్టర్ లను పిలిపించి కాలనీవాసులకు తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆదేశాలు జారీ చేశారు. తాగు నీరు అందించాలని ఆదేశించి అందుకు కావలసిన ఖర్చులకు లక్ష రూపాయలతో పైప్‌లైన్ వేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫిట్టర్ శంకర్ , కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాతృత్వం చాటుకున్న కొత్త జైపాల్ రెడ్డి



కరీంనగర్, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః తల్లిదండ్రులు మృతి చెంది అనాథలుగా మారిన పిల్లలకు భరోసానిచ్చారు మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్ రెడ్డి. ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైరెడ్డి రజిత అనే మహిళ మృత్యువాతపడింది. అంతకుముందు ఆమె భర్త కూడా మరణించారు. దీంతో తల్లిదండ్రులను కోల్పోయిన వారి పిల్లలు బైరెడ్డి ప్రగ్యాత్ రెడ్డి, కృషిక్ రెడ్డిలు అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న జైపాల్ రెడ్డి వారి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు భవిష్యత్‌లో అన్ని విధాలా కుటుంబానికి అండగా ఉంటానని హామీనిచ్చారు. పిల్లల చదువులకు సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్ల శ్రీనివాస్ రెడ్డి, నర్ర శ్రీనివాస్ రెడ్డి, గంప సత్యనారాయణ, భూపతి రవీందర్ రెడ్డి, భూపతి జీవన్ రెడ్డి, భరోసా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో జాగ్రత్తలపై పారమిత విద్యార్థులచే అవగాహన కార్యక్రమం



కరీంనగర్, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పారమిత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నగరంలోని ప్రజలకు వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రెండు రోజులపాటు నిర్వహించనున్న అవగాహనా కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలోని జ్యోతి రావు పులే మైదానం, శాతవాహన విశ్వవిద్యాలయ ప్రాంగణం, శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాల మైదానంలో పారమిత విద్యార్థిని, విద్యార్థుల బృందాలు ఆయా ప్రాంతాలకు వాకింగ్, వ్యాయామం కోసం వచ్చే ప్రజలకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అలాగే అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన, వడదెబ్బ సమయంలో తీసుకోవలసిన ఆహార నియమాలు, ఈత కొలనులో తీసుకోవలసిన జాగ్రత్తలు, నిత్యం ఫోన్ ల ఉపయోగం నుండి పుస్తక పఠనం దృష్టి సారించడం, పుస్తక పఠనం యొక్క ప్రాధాన్యం గురించి, నిజ జీవితంలో పండ్లు, ఫలాల యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. రెండో రోజు కార్యక్రమంలో భాగంగా శనివారం అంబేద్కర్ క్రీడా ప్రాంగణం, రాంనగర్ మార్క్ ఫెడ్ ప్రాంగణం, మానేర్ డ్యామ్ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థిని, విద్యార్థులకు నగర వాసులు సహాయ సహకారాలు అందించాలని పాఠశాల యాజమాన్యం కోరింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థిని, విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రస్మిత, రాకేశ్, అనుకర్‌రావు, వినోదరావు, వియుయం.ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, ఆనంద్ కమలాకర్, బాలాజి, కవిత, ఏస్ఓడి తిరుపతిరావు, సమన్వయకర్తలు శ్రీనాథ్, శ్వేత, సరిత, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## పాలాభిషేకాలు చేయించుకున్నారు...

# చేతులు దులుపుకున్నారు

### - ఎంపిగారు... రైల్వే బ్రిడ్జి సంగతేంటి..?

### : సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 21 (మనం న్యూస్): కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు కోసం 154 కోట్ల రూపాయల నిధులు తెచ్చినట్లు ప్రకటించుకున్న ఎంపి బండి సంజయ్‌కుమార్, పాలాభిషేకాలు చేయించుకుని చేతులు దులుపుకున్నారని సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం విమర్శించారు. రైల్వే గేటు కారణంగా విద్యార్థులు, ప్రజలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడి ఇబ్బందుల పాలవుతున్నా పట్టించుకోకుండా వ్యవహరించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. శుక్రవారం స్థానిక ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు తెచ్చానని గత రెండు సంవత్సరాలుగా చెబుతున్న సంజయ్ ఇప్పటి వరకు దాని నిర్మాణం ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి పాలనలో ఉన్నప్పటికీ అదే పార్టీకి చెందిన ఎంపిగా కరీంనగర్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారం గురించి బండి ఏనాడూ కృషి చేయడం లేదని పేర్కొన్నారు. ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తప్ప, ప్రజలను ఉపయోగపడే పనులను నిర్వహించడంపై ఆయనకు ఆసక్తి లేదన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా కరీంనగర్ ఎంపీగా సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి కేంద్రం నుండి ఏం నిధులు తీసుకొచ్చారో ప్రకటించాలని సత్యం సవాల్ విసిరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకొని కరీంనగర్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేసేంతవరకు ప్రజల పక్షాన సిపిఎం అండగా ఉండి పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు పుల్లెల మల్లయ్య, జి.తిరుపతి, కొంపల్లి సాగర్, ఓ.అరవింద్, నగర నాయకులు కోనేటి నాగమణి, గాజుల కనకరాజు, రత్నం సురేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి



కరీంనగర్, ఏప్రిల్ 21 (మనం న్యూస్): ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ముస్లిం ఉపాధ్యాయులు శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ, ముస్లింల ఐక్యతకు ఇఫ్తార్ విందులు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయుటిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముసుకు తిరుపతిరెడ్డి, మూల జైపాల్ రెడ్డి, మాజీ రాష్ట్ర నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, నాయకులు అబ్దుల్ జమీల్, ముజీబ్ , అంజద్, ఉమర్ అలీ, జాలి మహేందర్ రెడ్డి, శ్రీకాంత్ రావు, సిహెచ్.నాగేశ్వరరావు, రాజభాను, వెంకట్రాజం, ఎల్వి రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భాజపా పూడ్చేస్తాం.. మమ్మల్ని ఆపేదెవరు..?



మెట్ పల్లి, ఏప్రిల్ 21 (మనం న్యూస్): డిస్ట్రిబ్యూటరీ కాలువను కనుమరుగు చేసే యత్నాలు సాగుతోన్నప్పటికీ ఏ ఒక్క అధికారి స్పందించకపోవడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జెసిబితో కాలువను పూడ్చివేస్తున్నారని తెలుపుతూ పత్రికల్లో వచ్చిన కథనాలకు కూడా ఏ మాత్రం స్పందన లేకుండా పోయింది. కాలువను పూడ్చేస్తున్న వ్యక్తులు మాత్రం భాజపా పూడ్చేస్తాం.. మమ్మల్ని ఆపేదెవరు..?

### డిస్ట్రిబ్యూటరీ కాలువ పూడ్చేస్తున్న వైనం

అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని బస్సు డిపో నుండి వేంపేట వెళ్ళు రోడ్డులో రైల్వే బ్రిడ్జి దాటిన తర్వాత ఉన్న డిస్ట్రిబ్యూటర్ కాలువను ఆక్రమించుకొని ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఆ నిర్మాణ పనుల విషయమై పలు పత్రికల్లో రాగా ఆ పక్కనే ఉన్న ఇందిరా నగర్ కాలనీవాసులు ఈ డిస్ట్రిబ్యూటరీ కాల్వ మూసిపోతే కాలువ నుండి వచ్చే నీరు ఆగిపోయి కాలనీ లోని ఇళ్లకు నీరు చేరుతుందని నిర్మాణ పనులు ఆపించారు. అనంతరం గత నెల రోజుల క్రితం ఎస్సారెస్పీ అధికారులు, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి హద్దులు ఉంచారు. కానీ అధికారికంగా సర్వేయర్ ఎస్సారెస్పీ అధికారులకు కొలతల రికార్డు పత్రం అందించకపోవడంతో సంబంధిత అధికారులు ఆ అక్రమ నిర్మాణం తొలగించకపోవడంతో నిర్మాణదారుడు జెసిబి తో డిస్ట్రిబ్యూటర్ కాలువను పూడ్చివేయడం ప్రారంభించాడు. అది తెలుసుకున్న కాలనీవాసులు అక్కడికి వెళ్లి పనులను ఆపించారు. కాగా అతనికి భూమిని అమ్మిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు హద్దులలో డిస్ట్రిబ్యూటర్ కాలువను చూపకపోవడంతో ఆ వ్యక్తి యదేచ్ఛగా కాల్వను పూడ్చి వేయడానికి సిద్ధపడ్డాడు. ఆ కాల్వ పూడ్చి వేస్తే ఇందిరానగర్ కాలనీలోని ఇళ్లల్లోకి నీరు చేరుతుంది. అలాగే కింద ఉన్న పంట పొలాలకు నీరందక రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఇకనైనా సంబంధిత అధికారులు డిస్ట్రిబ్యూటర్ కాలువను ఆక్రమణకు గురికాకుండా చూసి ప్రభుత్వపరంగా రైతులను నష్టపోకుండా చూడాలని కాలనీవాసులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## సమాజనిర్మాణంలో

### అంగన్‌వాడీల పాత్ర గొప్పది



వీణవంక-ఏప్రిల్21(మనం న్యూస్): మండలంలోని శ్రీరాములపేట గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో ప్రీస్కూల్ మేళాను శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొల్లూరి సంధ్యబాపురావు హాజరై మాట్లాడారు. సమాజనిర్మాణంలో అంగన్‌వాడి కేంద్రాల పాత్ర గొప్పదని, ప్రైవేట్ స్కూల్స్‌కు దీటుగా విద్యాబోధన చేస్తున్నారని, పిల్లలకు, గర్భిణీలకు పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నారని అన్నారు. తదుపరి చిన్నారులు పాడిన ఇంగ్లీష్ రైయమ్స్,కథలు,ఆడిన ఆటలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.అనంతరం విద్యార్థులకుఅసైన్‌మెంట్ కార్డులు, అంగన్‌వాడి పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి ఉపాధ్యాయురాలు మ్యాడగోని స్వర్ణరాణి, ఆయా సుమలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలి

### శాంతి భద్రతల పరిరక్షణ కొరకు

### కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

### గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్

గోదావరిఖని, ఏప్రిల్ 21 (మనం న్యూస్):- నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని గోదావరిఖని ఏసిపి గిరిప్రసాద్ అన్నారు.శుక్రవారం గోదావరిఖని ఇంద్ర నగర్ లో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు.ఇళ్లను సోదాలు చేసి పత్రాలు సరిగా లేని వాహనాలను సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఏసిపి గిరిప్రసాద్ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల రక్షణ,భద్రత భావం,సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి,ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకుంటున్నారు. ఆధార్ కార్డు తీసుకువచ్చిన వారి



వద్దనే స్క్రాప్ కొనాలని స్క్రాప్ దుకాణం యజమానులను ఆదేశించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు ఇల్లు అద్దెకొరకు వస్తే పూర్తి వివరాలు అడిగి వారి వద్ద నుండి ఆధార్ కార్డ్ తీసుకోవాలి,ఏమైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.వాహనాలు నడిపేటప్పు డు తప్పకుండా హెల్మెట్ ధరించి,ట్రాఫిక్ నియమాలను పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు.ప్రజలు, మహిళలు ఆపద సమయంలో స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.ప్రజలకు పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు అనే భరోసా నమ్మకం కలిగించేందుకు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ,దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.ఎవరైనా కొత్తవారు,అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే వెంటనే పోలీసులకు,డయల్ 100 లేదా 1టౌన్ సీఐ నెంబర్ 8712656516 కి ఫోన్ చెయ్యడం ద్వారా వెంటనే చర్యలు చేపడతామన్నారు. తనిఖీలు నిర్వహించడం వలన నేరాల రేటు తగ్గుతాయని ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోస పోయి నష్టపోయితే వెంటనే 1930 లేదా డయల్ 100 కి కాల్ చేసి ఫిర్యాదు చెయ్యాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐలు ప్రమోద్ రావు,ప్రసాద్ రావు,రామగుండం సీఐ చంద్రశేఖర్ గౌడ్ ,2టౌన్ సిఐలు వేణుగోపాల్,అఫ్జలుద్దీన్,ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం




హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 21-మనం న్యూస్ : మండలంలోని ధర్మరాజుపల్లి, రంగాపూర గ్రామాల్లో పోతిరెడ్డిపేట, సిర్సపల్లి గ్రామాల్లో శుక్రవారం బాల వికాస సంస్థ ఆద్వర్యంలో చలి వేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బాల వికాస ప్రతినిధి ఖాజాబీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పుల్లాచారి, పాకాల లక్ష్మారెడ్డి, వార్డు సభ్యులు బొడ్డు రజిత, కొమురమ్మ, సదాదేవి, లావణ్య తదితరులు ఉన్నారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 21-మనం న్యూస్ : మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్‌లు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, వార్డు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

## లాభదయాక యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలి



హుజూరాబాద్ రూరల్ ,ఏప్రిల్ 21-మనం న్యూస్ : దళిత బంధు పథకంలో లాభదయాక యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక కోరారు. శుక్రవారం పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో జిల్లా పరిశ్రమల శాఖ ఆద్వర్యంలో దళిత బంధు పథకం కింద చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకునే లబ్దిదారులకు అవగాహన కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ మిషన్‌లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు,హుజూరాబాద్‌వెస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్‌లు సల్వాది సమ్మయ్య, శ్రీనివాస్, ఇండస్ట్రీయల్ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, ఎంపీడవోలు విజయలక్ష్మి, కల్పన తదితరులు ఉన్నారు.

## సిపిఆర్‌పై శిక్షణా కార్యక్రమం



తిమ్మాపూర్, ఏప్రిల్ 21 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి పోలీస్ స్టేషన్ పరిధిలో రాష్ట్ర రోడ్ సేఫ్టీ ఆర్ఐ. వైవి.ప్రతాప్, ఈఎంఆర్ఐ ప్రతినిధి డాక్టర్ సుమన్ ఆధ్వర్యంలో శుక్రవారం సిపిఆర్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ సిఐ రమేష్ మాట్లాడుతూ అనుకోని సంఘటనలు, ప్రమాదాలు జరిగిన సమయంలో మనిషి గుండె స్తంభించి, శ్వాస తీసుకోవడం సమస్యగా మారినప్పుడు వారి ప్రాణాలు కాపాడడం కోసం హృదయ, శ్వాసకోశ పునరుజ్జీవ చర్య చాలా కీలకంగా పని చేసి, గుండె తిరిగి పని చేసే విధంగా ఉపయోగ పడుతుందని చెప్పారు. సిపిఆర్ ప్రక్రియ ఏ రకంగా చేయాలనే విషయంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం కోసం రాష్ట్ర రోడ్ సేఫ్టీ, జీవికె, ఈఎంఆర్ఐల సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా కరెంట్ షాక్ తగిలినప్పుడు, రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో, అకస్మాత్తుగా స్పృహ కోల్పోయిన సమయంలో, శ్వాస సమస్యలు వచ్చి గుండె ఆగిపోయిన సందర్భాల్లో సిపిఆర్ ప్రక్రియ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని ఆయన వివరించారు. అలాంటి సమయాల్లో ఛాతీ మీద పలుమార్లు బలంగా నొక్క డం వల్ల ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని చెప్పారు. పోలీస్ సిబ్బంది అందరికి సిపిఆర్ ప్రక్రియ పట్ల పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎండి ఎస్ఐ ప్రమోద్ రెడ్డి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దుర్గంధ వాసనలో మచ్చుపేట

## నిధులు మంజూరైన అమలుకు నోచుకోని వైనం

ముత్తారం,ఏప్రిల్ 21 మనం న్యూస్ : ఏండ్లు గడుస్తున్న ఆయా గ్రామపంచాయతీల తీరు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామంలో చాలా చోట్ల సైడ్ డ్రయిన్లు లేక సైడ్ డ్రయిన్లు ఉన్నచోట అస్తవ్యస్తంగా ఎక్కడికక్కడే చెత్త జమై పూడిక తీతలేక దుర్గంధంతో వీధులన్నీ మురికి కూపంగా ఉన్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇంతటి దుర్గంధభరితమైన మురికి కూపంలో మచ్చుపేట గ్రామ వాసులు విష జ్వరాలతో వివిధ రకాల అనారోగ్యాలతో అవస్థలు పడుతున్న మురికి కాలువల్లో ఉన్న చెత్తను తొలగించే పారిశుద్ధ్య కార్మికులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యంగా ఉంటున్నారని,చెత్తను తీసుకెళ్లే రిక్షాలు పాడైపోయి చిన్న చిన్న గల్లీల్లోకి ఇరుకుగా ఉండి ట్రాక్టర్లు రాలేక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి ఉంటుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో చేతి బోర్ల దగ్గర ముండ్ల చెట్లతో నిండి ఉన్నాయని,చేతి బోర్ వద్ద నిలబడడమే కష్టంగా ఉంటుందని వాపోయారు. గ్రామంలో ప్రధాన సీసీ రోడ్డు పక్కన పైప్ లైన్ గేట్ వాల్‌కు వినియోగించిన కుండీలపైన మూతలు వేయకపోవడంతో రోడ్డు పక్కన నడిచే ప్రజలకైన ఉన్న మూగజీవాలకైనా ఈ కుండీలలో పడితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని అన్నారు. అంగన్వాడి పాఠశాలలో రెగ్యులర్ టీచర్ లేక ఇబ్బంది పడుతున్నారని,ఒకే చిన్న గదిలో అంగన్వాడి కేంద్రం నిర్వహించడం ఇబ్బందిగా ఉంటే దానికి తోడుగా చాలదన్నట్లు ఆ చిన్న గదిలో పెద్ద సోలార్ పరికరాన్ని చిన్నారులకు మరింత ఇరుకుగా అయ్యేలాచేశారని,అంగన్వాడి కేంద్రం దగ్గర వాటర్ ట్యాంకుకు సంబంధించిన గేటువాల్ రంధ్రంతో ప్రమాదం పోంచి ఉన్నదని,అంగన్వాడి స్కూల్‌కి వచ్చే చిన్నారులు దాని చుట్టూనే తిరుగుతూ అన్నం తిని చేతులు కడుక్కుంటూనో,అడుకుంటూనో ఎవరైనా పిల్లలు ఆ గేట్ వాల్ కుండీలో పడితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని చిన్నారుల తల్లిదండ్రులు వాపోయారు. మిషన్ భగీరథ నీటి కులాయిల బిగింపులు నామ మాత్రంగానే పాత వాటినే బిగించారని ,మిగితావి ఎక్కడివి అక్కడే వదిలేశారని,చేతిపంపుల్లో సరిగ్గా నీళ్లు రావడం లేదని మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నదని అన్నారు. బస్టాండ్ దగ్గర నిర్మించిన సామూహిక మరుగుదొడ్డును అసంపూర్తిగా నిర్మించి,నీటి వసతి లేకుండా ప్రారంభం కాకుండానే బీటలు వారెలా నిరుపయోగంగా ఉన్నదని వాపోయారు. మచ్చుపేట గ్రామపంచాయతీ భవనానికి నిధులు మంజూరైనా గాని నిర్లక్ష్యంతో ఇప్పటికీ కూడా నిర్మాణం చేపట్టకుండా అద్దె భవనంలోనే గ్రామపంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. సుమారుగా రెండున్నర కోట్లతో మచ్చుపేట బస్టాండు నుండి ఎంతో అధ్యాత్మికత కలిగిన బహుగుల్ల వరకు నిధులు మంజూరైన బహుదశ పట్టనట్టుగానే ఇప్పటికీ కూడా పనులు ప్రారంభం చేయడంలో అలసత్వం వహిస్తున్నారని గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని మచ్చుపేట గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## చలివేంద్రంలోని రంజన్లను ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

### మా గుర్తింపును ఓర్వలేకనే నీచమైన పనులు




రామగిరి,ఏప్రిల్ 21 మనం న్యూస్ : పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో 16 తేదీన ముస్త్యాల నుండి మంథని వెళ్లే నూతన రోడ్డులో అటుగా వెళ్లే ప్రయాణికులు ఎండ ఏడికి చాలా ఇబ్బందులు పడుతున్నారని,స్థానిక ముత్యాల సర్పంచ్ రామగిరి లావణ్య సొంత ఖర్చులతో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణీకుల దాహార్తి తీర్చడం జరిగింది. కానీ ప్రయాణీకులకు మంచి చేయాలని మంచి ఉద్దేశంతో ఓ కార్యక్రమం ప్రార ంభిస్తే కొంతమంది నీచమైన పనికి పొడి కట్టారు. గురువారం రోజు సర్పంచ్ లావణ్య ఏర్పాటు చేసిన చలివేంద్రంలోని రంజన్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకపోవడం జరిగిందని తెలిపారు. ఈ విషయం సర్పంచ్ దృష్టికి రావడంతో హుటాహుటిన మళ్లీ కొత్త రంజన్లు తెప్పించి చలివేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ మేము ఎన్నో సేవలు చేస్తూ అభివృద్ధిలో ముందుండే మంచి పాలకులుగా గుర్తింపు రావడంతో కొంతమంది ఓర్వని తనంతో ఈ నీచమైన పనికి వొడిగట్టడం సిగ్గుచేటాని,ఏదైనా ఉంటే మాతో కొట్లాడాలి కానీ ఎండలో వెళ్లే ప్రయాణికుల దాహార్తి తీర్చే చలివేంద్రంలో రంజన్లను ఎత్తుకుపోవడం ఎంత బుద్ధిలేని పనిఅని సర్పంచ్ మండిపడ్డారు. ఇదే విషయమై స్థానిక సీఐకి చరవాణిని ద్వారా విషయం తెలిపామన్నారు. సిఐ సానుకూలంగా స్పందించి తొందర్లోనే ఈ ఈ రంజన్లు ఎత్తుకెళ్లింది. ఎవరనేది తెలుసుకుంటామని హామీ ఇచ్చారు.

## సెయింట్ మేరీస్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

### -కేజీ నుండి హై స్కూల్‌లోకి అడుగిడిన చిన్నారులు



సుల్తానాబాద్ ,ఏప్రిల్ 21 మనం న్యూస్ : సుల్తానాబాద్ మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఫాథర్స్ తుమ్మ అశోక్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పొందేటప్పుడు ధరించే ప్రత్యేక దుస్తులకు ధరింపచేసి బ్యాండ్ మేళాలతో సెక్షన్ నుండి హై స్కూల్ వరకు ఆర్భాటంగా తీసుకొని వచ్చి ప్రత్యకంగా ఏర్పాటు చేసిన స్టేజీ వద్ద వారిని సన్మానించి గ్రాడుయేషన్ సర్టిఫికెట్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ ఫాథర్ తుమ్మ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ముందుగా పిల్లల తల్లిదండ్రులను ఓపికతో తమ పిల్లలను తీసుకొచ్చి నందుకు అభినందించారు. కిండర్ గార్డెన్ నుండి హై స్కూల్‌కి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు మొత్తం 85 మంది చిన్నారులు కాగా వారిలో 54 మంది పిల్లలు మాత్రమే వచ్చారని,మిగతావారు కొన్ని అని వార్యకారణాలు వాళ్ళ రాలేకపోయారని, రాని వారికి కూడా మరోసారి ప్రత్యేకంగా గ్రాడ్యుయేషన్ అందచేస్తామన్నారు. చిన్నారులు విత్తనాలాంటి వారని సెయింట్ మేరీస్ పాఠశాల అనే భూమిలో నాటారని ఎంత పెద్ద చెట్టు ఆయన వేరు ముఖ్యం అని ఆ వేరు బలంగా ఉన్నప్పుడే చెట్లుట బలంగా దృడంగా ఎదుగుతుందని వివరించారు. ప్రస్తుతం చిన్నారులు మంచి వేరుని మంచి వేరుని సాధించారని,ఇకముందు హై స్కూల్‌కి వెళ్లి మంచి చెట్టుగా ఎదిగి రేపటి పౌరులుగా ఎదగటానికి మొదటి అంతస్థు ఎక్కతున్నందుకే ఈ గ్రాడ్యుయేషన్ డే అని పేర్కొన్నారు. నేడు గ్రాడ్యుయేషన్ పొందుతున్న విద్యార్థులు అందరు మేము బడికి పోమె అని ఏడ్చినవారే అని,ఇప్పుడు చూడండి వారందరు సంతోషంగా ముందు స్కూల్‌కి వస్తున్నారని అభినందించారు. ఇందుకు పాఠశాల ఉపాధ్యాయులు,పాఠశాల వాతావరణమే కారణం అని కొనియాడారు. వేరు బలంగా ఉన్నట్టే చిన్నారుల మెదడు నిండా దయ,మంచి,చేడు,ప్రేమ,జాలితో పాటు మొదటి అక్షఱ జ్ఞానం పూర్తిగా నింపామని నింపామని హర్షం చేశారు. అనంతరం ఫాథర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కవ మంది వ్యవసాయ దారులు ఉన్నారు. కాబట్టి కూరగాయాలతో ఒక పిల్లాడికి వండి పెడితే హాయిగా భోజనం చేసి పడుకుంటాడని,అదే కూరగాయలు పండించడం నేర్పిస్తే జీవితంలో పైకి ఎదగడంతో పాటు పది మందికి పనికల్పిస్తాడని ఉద్బోదించారు. అదేవిధంగా చిన్నారులను మన పాఠశాలలో తయారు చేస్తున్నామని చెప్పు కోవడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చిన్నారు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అడిపాడి ఉల్లాసంగా,ఉత్సాహంగా కేరింతలతో పలువురిని అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫాథర్ ప్రభాకర్‌రెడ్డి ,ఏ సంపత్,కే.సతీష్,ఎస్ కమలాకర్,బి.కుమారస్వామి,ప్రవీణ్,హరీష్,సిస్టర్ ఫ్లోర,సిస్టర్ మేరియా,నీరజ,జవేర మల్లీశ్వరి,హెలెన్ ,అనూష,ఎం శారధ,ఉమ,ఎస్ రజిత, అంజూరాణి, సరోజన,సరిత,స్వప్న,అర్చన,నందిని,రజిత,అనిత,సరిత,ఆర్ స్వప్నలతో పాటు ఆఫీస్ సిబ్బంది సురేష్,మాలిక్,సాగర్,తాల్ల రమేష్,సంపత్, రమేష్, అనిల్;అభి, సంపత్, శంకరయ్యలతో పాటు ఆయాలు,చిన్నారులు,తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.